GLOBAL TELUGU CHRISTIAN MINISTRIES

# NEWS LETTER

For Private Circulation only

క్రిస్మస్ 2014

ప్రపంచ వ్యాప్తంగా విస్తరించియున్న డియర్ తెలుగు క్రైస్తవ మిత్రులారా,

పరిశుద్ధుడైన యేసుక్రీస్తు నామంలో మీకు శుభాలు. మీరంతా క్షేమమేననీ, మీ కుటుంబాలూ, సంఘాలూ, సహవాసాలు, పరిచర్యలూ దైవానుగ్రహంతో వృద్ధిచెందుతున్నాయనీ భావిస్తున్నా. ప్రార్థిస్తూన్నా. గత రెండు న్యూస్ లెటర్స్ లో ఆరోగ్యవంతమైన సంఘం అనే అంశం మీద మీ వ్యాసాలను కోరడం మీరెరుగుదురు. ఆ ఆహ్వానం మీ భాగస్వామ్యం కోసం ఎదురు చూస్తూనే వుంది.

జీటీసీయెం పరిచర్యల కొరకూ, వ్యవస్థాపక త్రయం రెవ.డా.లివింగ్‌స్టన్ గద్దె, డా. డేవిడ్ చిగురుపాటి, డా.జోసఫ్ పాతూరి గార్ల కొరకూ, నా కొరకూ, బోర్డ్ మెంబర్ల కొరకూ మీరు చేస్తోన్న ప్రార్థనలను బట్టి, ప్రోత్సాహాన్ని బట్టి మీకు మా వందనాలు.

ఈ సంచికలో మీతో పంచుకోడానికి అనేక అంశాలు వున్నాయి. ప్రార్థించే మీకు తెలుసుకోవలసిన హక్కు వుంది. ప్రభువు కృపలో అక్టోబర్ 3–5 తేదీల్లో జీటీసీయెం గల్ఫ్ రీజనల్ కాన్ఫరెన్స్ షార్జా దేశం లోనూ, 10–11 తేదీల్లో అండమాన్ & నికోబార్ ఐలెండ్స్ రీజనల్ కాన్ఫరెన్స్ పోర్ట్ బ్లెయిర్ లోనూ ఆ ప్రాంతాల తెలుగు క్రైస్తవ సంఘాల శ్రేయస్సు కొరకూ, ప్రభువుకు అత్యధిక మహిమ కరంగానూ జరిగాయని తెలియజేయడానికి సంతోషిస్తూన్నా! అక్టోబర్ 18 వ తేదీ గుంటూరులో శ్రీమతి గద్దె సుధా లివింగ్‌స్టన్ మెమోరియల్ ట్రస్ట్ భవనానికి, జీటీసీయెం భవన సముదాయానికి పునాది రాళ్ళు వేయడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రభువు మహిమార్థం అనేకమంది అతిథులూ, ఆహ్వానితుల సమక్షంలో జరిగింది. కార్యక్రమానికి నేను అధ్యక్షత వహించగా రెవ.డా.జోసఫ్ పాతూరి గారు దైవ సందేశాన్ని అందించారు. డా. డేవిడ్ చిగురుపాటి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డా॥ డేవిడ్ చిగురుపాటి గారు శ్రీమతి గద్దె సుధా లివింగ్‌స్టన్ ట్రస్ట్ బిల్డింగ్‌కూ, అపో॥ డా॥ లివింగ్‌స్టన్ గద్దె గారు జీటీసీయెం బిల్డింగ్‌కు ఫౌండేషన్ స్టోన్స్ వేసారు. ఈ ప్రాజెక్టులు దేవుని మహిమ కొరకూ, ప్రపంచ వ్యాప్త తెలుగు క్రైస్తవ సంఘ క్షేమాభివృద్ధి కొరకూ జరిగాయని తెలియజేస్తూ ప్రార్థించిన మీకు వందనాలు చెప్పుకొంటున్నా. - ప్రియనాథ్ హూషస

## క్రిస్మస్ కేండిల్ సర్వీస్

( క్రిస్మస్ కేండిల్ సర్వీస్ భావసహితంగా జరుపుకోవడానికి రాయబడిన స్క్రిప్ట్ )

అంధకారంలో అఖిల జనాలూ అలమటించిపోతున్న రోజులవి. అవివేకంతో అవని మానవులు ఆహుతి యౌతున్న దినములవి. సత్యమెరుగక సకల జనాలూ సాగిపోతూన్నారు. ముక్తి కొరకు ముల్లోకాలూ పయనిస్తూన్నారు. చెట్టుపుట్టలను పసుపు కుంకుమలతో సింగారిస్తూన్నారు. పాప విమోచన కొరకై ప్రజలు ప్రాకులాడుతూన్నారు. పాపవిముక్తి కొరకై బలులర్పిస్తూన్నారు. రక్త ప్రోక్షణతో ముక్తి కలుగుతూందని మురిసి పోతూన్నారు. కోడి,గొర్రె,మేకల రక్తం కుమ్మరిస్తూన్నారు. ఆత్మ శాంతికై అహోరాత్రాలు పరితపిస్తూన్నారు. శాంతి యీయని సాధనాలతో సతమతమౌతున్నారు.

ఒక్క మాటలో చెప్పాలంటే అవని అంతా అంధకార బంధురమై పోయింది. ఇట్టి తరుణంలో.. ఈ అజ్ఞానాంధకార లోకంలో శుభ క్రిస్మస్ చోటు చేసుకొంది. ఇది లోక రక్షకుడైన యేసుక్రీస్తు పుణ్యజన్మ విశేషం. మానవాళి మనుగడలో అరుణోదయ కాంతులు విరజిమ్మిన దినం. ఇహలోక, పరలోక స్థితిగతుల నూతన ఉషోదయ దినం. గమనం, గత్యంతరం లేని స్థితిలో సర్వ సృష్టి వేదనతోనూ, వచింప శక్యంగాని మూల్గులతోనూ ప్రసవ వేదన పడుతూన్న స్థితిలో మృత్యులను అమర్త్యులను జేయ భగవంతుడు సంకల్పించిన దినం. ఈ కథ మొదలిలా వుంది–

ఓ రోజు..... సూర్యుడు పశ్చిమంగా కదలిపోయిన అదను చూచి ప్రకృతి చిమ్మ చీకటి భూతలాన్ని కప్పివేసినపుడు.. పాలు తేనెలు ప్రవహించే పాలస్తీనా దేశంలో, యెరూషలేముకు ఆమడ దూరంలో....పల్లె సీమల ప్రజాజీవన సరళికి ఆటపట్టయిన బెత్లెహేములో, ఒక పశువుల కొట్టంలో, దైవ ప్రభోదాన్ని పొందిన దావీదు గోత్రపు మరియ యోసేపులు అలసటతోనూ, ఆందోళనతోనూ ప్రపంచ చరిత్రను తారుమారు చేసే పరిస్థితిని కలలు కంటూండగా– నింగినిండిన చుక్కలన్నీ ఏదో భవిష్యస్సంభావాన్ని పసిగట్టి సంభ్రమాశ్చర్యాలతో ఇలాతలాన్ని తమ విశాల నేత్రాలతో వీక్షిస్తూన్నప్పుడు; స్వర్గం తన తలుపులు తెరచి మానవాళిని దర్శించింది మానవునిగా. దేవుణ్ణి నమ్మలేకున్నా తోటి మానవుని విశ్వసిస్తాడుగా మానవుడు! అందుకే మానవావతారియైనాడు దైవం.

యోసేపు అనే యౌవ్వనుడు తనకు భార్యగా ప్రధానం గావించబడి పురుషు నెరుగకయే పరిశుద్ధాత్మ శక్తితో నిండు చూలాలైన మరియతో జనాభా లెక్కల్లో నమోదు కాగోరి స్వగ్రామమైన బెత్లెహేముకు చేరుకొన్నాడు. ప్రసవ దినాలు నిండిన మరియ ప్రభావరుణ్ణి ప్రసాదించడానికి స్థలం దొరక్క ఏ రహదారి ప్రక్కనో బిడ్డను కని, పొత్తి గుడ్డలతో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టింది. పురుష ప్రమేయం లేకుండానే పరిశుద్ధాత్మ ప్రభావంతో కన్య మరియ గర్భాన భూలోకాన్ని దర్శించ వచ్చాడు మోక్ష మూర్తి మానవునిగా ...రక్షకునిగా.. మోక్షదాతగా...యేసుక్రీస్తుగా.

**కీర్తన:** శుద్ధరాత్రి! సద్దణంగా - నందరు నిద్రపోగా...

ఇదిలా వుండగా ఓ ప్రక్క బెత్లెహేము ఊరి శివార్లలో, కొండవార్లల్లో, దేవాలయంలో బలియాగం నిమిత్తం ప్రధాన యాజకునిచే నియమింప బడిన గొర్రె మందల్ని కాస్తున్న పశుల కాపర్లకు పరలోక దూత సైన్య సమూహం దేవదేవుని జన్మదిన శుభవార్తను ప్రకటించింది.

**కీర్తన:** దూత పాట పాడుడీ-రక్షకున్ స్తుతించుడీ
ఆ ప్రభుండు బుట్టెను-బెత్లెహేము నందునన్
భూజనంబు కెల్లను-సౌఖ్య సంభ్రమాయెను
ఆకసంబు నందున-మ్రోగు పాట పాడుడీ
దూత పాట పాడుడీ -రక్షకున్ స్తుతించుడీ

పాపఫలితంగా నిత్య నాశనానికి పోయే దౌర్భాగ్య స్థితి నుండి ప్రజానీకాన్ని తప్పించి రక్షించే సాధనం దొరికింది. ముక్తి మార్గం ప్రాప్తించింది. కులగోత్రాల హద్దులు చెరిగిపోయాయి. సాంఘిక, ఆర్థిక అడ్డుగోడలు కూలిపోయాయి. మానసికంగానూ, ఆధ్యాత్మికంగానూ అనువైన మార్పు కలిగింది. సత్యం ప్రాణమై ప్రభవించింది.

*-- అసతోమా సద్గమయా: --*

**కీర్తన:** శ్రీ రక్షకుండు పుట్టగా నాకాశ సైన్యము,
ఇహంబున కేతెంచుచు-ఈపాట పాడెను.
పరంబునందు స్వామికి మహా ప్రభావము
ఇహంబు నందు శాంతిని - వ్యాపింప నీయుడీ.

దుష్టశిక్షణ-శిష్టరక్షణ సిద్ధాంతాన్ని కాల రాసి, ఆరోగ్యం కలవానికి కాదు రోగికే వైద్యుడు కావాలన్నాడు యేసుక్రీస్తు. అందుకే ఎంత పాపినైన యేసు చేర్చుకొంటాడు. ఈ యేసు క్రీస్తే ప్రపంచానికీ, మానవ కోటికీ వెలుగయ్యాడు. అంధకారం పటాపంచలై పోయింది. నీతి సూర్యుని వెలుగు కాంతులు విరజిమ్మాయి ఇలాతలంపై. దేవుడు లోకమునకు వెలుగై యున్నాడు.

*-- తమసోమా జ్యోతిర్గమయ: --*

సుమేయోననే భక్తవరుడు, అన్న అనే శత వసంత వృద్ధ ప్రవక్త్రి యేసు బాలుని దర్శనం చేసుకొన్నారు. ఆనందోత్సాహంతో పరవశించిపోయారు. వారి హృదయంలో సంగీతం పరవళ్ళు త్రొక్కింది.

**కీర్తన:** ఓ సద్భక్తులారా! లోక రక్షకుండు -
బెత్లెహేమునందు నేడు జన్మించెన్.
రాజాధి రాజు ప్రభువైన యేసు నమస్కరింప రండి..

తూర్పు దేశాల జ్ఞానులు కొందరు ఆకాశంలో వినూత్న వర్ణ ప్రభావంతో విరాజిల్లుతున్న నూతన తారను జూచి ఎవరో మహారాజు జన్మించాడని గ్రహించి బంగారం, బోళం, సాంబ్రాణులను కానుకలుగా సమర్పించ సమకూర్చి, తార వెంబడి ప్రయాణం సాగించి, ఆటంకాలనూ, అవరోధాలనూ అధిగమించి బెత్లెహేము చేరుకొన్నారు. వినమ్రత వదనాలతో హృదయంలో నుంచి పెల్లుబికి వస్తున్న అభిమానాన్ని ప్రభువు ముందుంచారు.

**కీర్తన:** తూర్పు రాజుల త్రయమిది - చుక్క వెంట కాన్కలతో
గిరులు తరులు గుహలు దాటి - ఇటకు చేరితిమి
ఓ... వింత చుక్క మార్గమా - రాజ తార రమ్యమా
వేగిరంబు నడిపి మమ్ము - వెల్గు లోనికి దెచ్చితీ

1. బెత్లెహేము రాజును- మకుట ధారి జేయును
నిత్య మేలు రాజు కొరకు పసిడి కానుకలు ఓ... వింత
2. పరిమళంపు బోళమిది- మైత్రి గూర్చు సూత్రమిది
మరణ దుఃఖ: శ్రమదమాదుల్ సమసి పోయెను ఓ...వింత
3. సాంబ్రాణిదిగో దెచ్చితిని - యాజకత్వ యార్చనము
స్తుతు లొనర్చి మానవాళి - పూజ లొనర్తురు. ఓ... వింత
4. మహిమ రాజు లేచెను - మరణ విజయుడాయెను
హల్లెలూయ గానములతో - నింగి చేరను. ఓ... వింత

మానవుని పాప జీవిత బంధకాలు తెగిపోయాయి. ఆధ్యాత్మిక పురోగతికి అవరోధపు సంకెళ్ళూడిపోయాయి. మతాల ముసుగుమబ్బులు వీడిపోయాయి. కులాల కుళ్ళు కరిగిపోయింది. యజ్ఞయాగాదుల ప్రభావం హరించుకు పోయింది. యజ్ఞ పశువుగా యేసుక్రీస్తు సిలువ మీద బలియాగం కావడం ద్వారా మోక్షానికి మార్గమైన యేసు క్రీస్తు జన్మ విశేషమైంది. ఆత్మీయంగా మృతుడైన మానవుని గుండెల్లో అమరత్వపు ఆశారేఖలు వెలిగాయి.

*-- మృత్యోర్మా అమృతం గమయ: --*

ప్రపంచ యుద్ధమో, మహా ప్రళయమో సంభవిస్తుందని క్షణక్షణ భయంతో నివసిస్తున్న నేటి మానవునికి, భార్యభర్తల మధ్య, తల్లిదండ్రులు - బిడ్డల మధ్య పొత్తు కుదరక గుండెల్లో బ్రద్దలయ్యే అగ్ని పర్వతాలకు తట్టుకోలేక అలసిపోతూన్న నేటి మానవునికి; పాప భారంతో గుండె జారిపోతూందని విలపించే నేటి మానవునికి..

ఆత్మకు శాంతినీ
హృదయానికి ఉల్లాసాన్నీ
మనసుకు వికాసాన్నీ
కల్పించేదే క్రిస్మస్!
ఇదే క్రిస్మస్ ప్రభోదం
ఇదే నవ జీవన శుభోదయం!

**కీర్తన:** హాయ్ లోకమా ప్రభు వచ్చెన్ అంగీకరించుమీ

నిజ క్రిస్మస్ ఆనందం మీ హృదయాల్నీ, గృహాల్నీ అలరించాలని సదా కాంక్షిస్తూ .. ప్రభుని ప్రార్థిస్తూ..

**- జీటీసీయెం**



**జీటీసీయెం విషెస్ యు హేపీ క్రిస్మస్ ఎండ్
ఎ బ్లెస్సెడ్ న్యూ ఇయర్ 2015**



## ప్రార్థనాంశాలు:

1. 2015 లో జెరూసలేంలో జరిగే జీటీసీయెం వారి వర్ల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిటి కొరకు.
2. అనేక పర్యటనలు చేస్తున్న జీటీసీయెం వ్యవస్థాపకులు రెవ.డా. లివింగ్‌స్టన్ గద్దె గారి కొరకు, వైస్ ప్రెసిడెంట్ రెవ.డా. జోసఫ్ పాతూరి గారి కొరకు, నా కొరకు, బోర్డ్ మెంబర్స్ కొరకు, ప్రస్తుతం ఇండియా, శ్రీలంక,గల్ఫ్, ఆఫ్రికాలో అనేక దేశాల్లో పర్యటిస్తున్న జీటీసీయెం పోషకులు డా. డేవిడ్ చిగురుపాటి గారి కొరకు ప్రార్థించండి.
3. రెవ.డా.లివింగ్‌స్టన్ గద్దె గారు అనేక కార్యక్రమాల నిమిత్తం ఇండియాలో వున్నారు.వారి ఆరోగ్యం కొరకు, కార్యక్రమాల కొరకు ప్రార్థించండి.
4. "ఒకని జన్మ దినము కంటే మరణ దినమే మేలు" అని దైవ వాక్యం చెబుతోంది. అక్టోబర్ 18 వ తేదీ గుంటూరులో శ్రీమతి గద్దె సుధా లివింగ్‌స్టన్ మెమోరియల్ ట్రస్ట్ భవనానికీ, జీటీసీయెం భవన సముదాయానికీ పునాది రాళ్ళు వేయడం జరిగింది. ఫౌండేషన్ స్టోన్స్ వేయడం కేవలం మొదటి మెట్టు మాత్రమే. ఆ కార్యక్రమం దైవానుగ్రహంతో జరిగి దర్శనం నెరవేరినపుడే దేవునికి మహిమ గనుక ప్రారంభిస్తోన్న కార్యం అతిత్వరలోనే నెరవేరి దేవుని నామం మహిమ పరచబడాలని ప్రార్థించ మనవి.
5. ఈ రెండు భవనాల నిర్మాణానికి సుమారు నాల్గు కోట్ల రూపాయలు కావాలి. మీ భాగస్వామ్యాన్ని కోరుకొంటున్నాం. మీరెలా సహకరించగలరో త్వరలోనే తెలియజేస్తాం.

### గల్ఫ్ కాన్ఫరెన్స్ ఛాయాచిత్రాలు




### పోర్ట్ బ్లెయిర్ కాన్ఫరెన్స్ ఛాయాచిత్రాలు




### ఈ పత్రికకు మీ వ్యాసాలూ, కవితలూ పంపండి.

ప్రచురణకు యోగ్యమైనవి ప్రచురిస్తాం. జీటీసీయెం ప్రచురించే గ్రంధాలు గానీ, వ్యాసాలు గానీ జీటీసీయెం ప్రాపర్టీ అని గుర్తించి వాటిని వాడుకోవాలని ఆసక్తి కలిగిన వారు అనుమతిని తీసుకోవాలని తెలియజేస్తున్నాం.

-ఎక్సేక్యూటివ్ డిరెక్టర్

### జీటీసీయెం గెస్ట్ రూమ్

వివిధ ప్రాంతాల నుండి విజయవాడ నగరానికి వచ్చే దైవసేవకులు, క్రైస్తవ నాయకులు మరియు విశ్వాసులు బసచేయుటకు జీటీసీయెం ఆఫీసు నందు అన్నీ సౌకర్యాలతో కూడిన గెస్ట్‌రూమ్ సిద్ధంగా ఉంది. డబుల్ ఆక్యుపెన్సీ రూమ్ కేవలం రూ. 1000/- దినసరి అద్దెతో లభ్యమౌతుంది. ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోగలరు. మరిన్ని వివరాలకు జిటిసియం మేనేజర్‌ను సంప్రదించండి.

## శుభవార్త

జీటీసీయెం జరిపే డబ్ల్యుటిసిఎస్ (వర్ల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిట్) దేవుని చిత్త మైతే 2015 లో జెరూసలెం లో జరపాలని నిర్ణయించాం. అనేకమంది తెలుగు క్రైస్తవులు ఈ సదవకాశం వినియోగించుకొంటారని మా ఆశ. మన ప్రియుడైన యేసు మానవునిగా సంచరించి అనేక కూటాలు జరిపి, స్వస్థతలు కలుగుజేసి, దేవాలయాన్ని శుద్ధిచేసి, సిలువను మోసి విమోచన ప్రసాదించిన నగరంలో, ప్రభువు తిరిగి వచ్చునపుడు తన రాజధానిగా చేసుకొని వెయ్యేళ్ళు పరిపాలన సాగించే నగరంలో ఈ చారిత్రిక సమావేశం జరపాలని మా కాంక్ష. మీ ప్రార్థనా, సహవాస సహకారం కొరకు ఎదురుచూస్తున్నాం. తేదీలు 2015 అక్టోబర్ 22-30., కార్యక్రమం విపులంగా తెలియజేయగలం. ఈ కార్యక్రమంలో మన కాన్ఫరెన్స్ తో పాటు హోలీ లేండ్ టూర్ కూడా ఉంటుందని మీకు తెలియజేయడానికి సంతోషిస్తోన్నాం.

# జీటీసీయెం ద్వారా లభ్యమౌతోన్న పుస్తకాలు

## ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు

## కవుల చరిత్ర, కీర్తనల సందేశము

**పురుషోత్తము చౌదరి నుండి**
**ఆచార్య ఏ.బి. మాసిలామణి వరకు**
**(29 మంది కవుల చరిత్ర)**

రచన : రెవ. డా. దాస్ బాబు
ఆంధ్ర క్రైస్తవ పాఠక లోకానికి అపూర్వ కానుక
జీటీసీయెం ప్రచురణ
320 పేజీలు - పేపర్ బ్యాక్
విడిప్రతి రూ. 125.00
బుక్ షాప్ డిస్కౌంట్ 30%
(25 పుస్తకాలు, ఆపైన)
ఇండివిడ్యువల్స్ డిస్కౌంట్ 15%
(10 పుస్తకాలు, ఆపైన)







264 పేజీలు - పేపర్ బ్యాక్
విడిప్రతి రూ. 100.00
బుక్ షాప్ డిస్కౌంట్ 25% (50 పుస్తకాలు, ఆపైన)




పేజీలు : 120
ముఖ వెల : రూ. 40.00,
జీటీసీయెం మీకు అందజేస్తోన్న
వెల విడిప్రతి రూ. 30.00
బల్క్ఆర్డర్ (పది ఆపైన) రూ. 25.00




పేజీలు: 1550
పుస్తక వెల 275.00
(విడి ప్రతి)
బల్క్ఆర్డర్ (పది ఆపైన)
రూ. 225.00




పేజీలు: 56
పుస్తక వెల 30.00
బుక్ షాప్ డిస్కౌంట్ 30%
(25 పుస్తకాలు, ఆపైన)
ఇండివిడ్యువల్స్ డిస్కౌంట్
15% (10 పుస్తకాలు, ఆపైన)




పేజీలు: 55
పుస్తక వెల 25.00
బుక్ షాప్ డిస్కౌంట్ 30%
(25 పుస్తకాలు, ఆపైన)
ఇండివిడ్యువల్స్ డిస్కౌంట్
15% (10 పుస్తకాలు, ఆపైన)

వచ్చే నెలలో మరోమారు కలసికొనే వరకు ఒకరినిమిత్తం ఒకరం ప్రార్థించుకొందాం.
దేవుని కృప మీకు తోడైయుండి ఆశీర్వదించును గాక.

క్రీస్తులో మీ సహదాసుడు **ప్రియనాథ్ రూఫస్,** ఎక్సెక్యుటివ్ డిరెక్టర్
ఫోన్ : 09494908413. ఇమెయిల్ : rufus1410@gmail.com
**జీటీసీయెం అడ్రస్:** 11-115, చాపరాల వారి వీధి, అశోక్ నగర్, విజయవాడ-520007. ఫోన్: 0866-2555687. మేనేజర్: 98660 83001
**Website: www.gtcm.in/org**